




# తొలి సమయం

దిన పత్రిక

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 11 | శనివారం 11-01-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## 26 నుంచి రైతుభరోసా..

# 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

### సాగుయోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా



**అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి**

**ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే**

**గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి**

**కలెక్టర్ల సదస్సులో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్,జనవరి10:** ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయకపోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెల్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అంత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్న దన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్

# రెండూ ఒక్కటే

**ఫార్ములా రేస్ కేసులో నిధులు ఎందుకు బదలాయించారు**

**700 కోట్లు ఎ క్కడ లాభాలు వచ్చాయో కెటిఆర్ చెప్పగలడా**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు**



**కరీంనగర్,జనవరి10:** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే ఆందోళనలు ఎందుకు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు. అందుకోసం ఏమైనా జైలుకు వెళతారా అని నిలదీస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి పైగా అడ్డగోలుగా మాట్లాడతవా అని కేటీఆర్ పై సీరియస్ అయ్యారు. కేబినెట్ ఆమోదం లేకుండా విదేశీ కంపెనీకి అంత అర్జెంట్‌గా 55 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్ తో ప్రభుత్వానికి రూ.700 కోట్లు లాభం వచ్చిందని కేటీఆర్ అంటున్నారు.. మరీ ఆ లాభాలు ఎక్కడ వచ్చాయో చూపించాలని డిమాండ్ చేశారు. లొట్టపీసు సీఎం, లొట్ట పీసు ప్రభుత్వం అని కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..? ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని అన్నారు. ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కాంగ్రెస్ హై కమాండ్‌కు కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేకపోతున్నారా.. అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై, కేసీఆర్ కుటుంబ అవినీతిపై బీజేపీ రాజీలేని పోరు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా బండి సంజయ్ స్పష్టం చేశారు.

## హోటల్ గదిలో ప్రేమజంట బలవన్మరణం

**సంగారెడ్డి,జనవరి10:** సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారంట్‌లో గురువారం మధ్యాహ్నం ప్రేమ జంట గదిని అద్దెకు తీసుకుంది. శుక్రవారం గది ఖాళీ చేయాల్సి ఉండగా వారు బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలు బద్దలుకొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారి తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతులను నారాయణఖేడ్ మండలం నారాయణపేట గ్రామానికి చెందిన ఉదయ్ (20), అదే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి**

**టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య**

**మరో అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిల పేర్లు వెల్లడి**




**హైదరాబాద్,జనవరి10:** తెలంగాణలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగానే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థి పార్టీలకు బీజేపీ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్- మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేరును బీజేపీ ఖరారు చేసింది. నిజామాబాద్ -ఆదిలాబాద్- కరీంనగర్- మెదక్-టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కోమరయ్య పేరును ప్రకటించింది. అలాగే వరంగల్- ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిని కాషాయం పార్టీ ప్రకటించింది. అన్ని ప్రధాన పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ దూకుడు పెంచేలా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రస్తుతం ఫోకస్ పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేస్తోంది. ఈ మూడు స్థానాలను సైతం కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది.

## సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై

# హైకోర్టు అసంతృప్తి

**ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని హైకోర్టు ఆదేశం**


**గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక అనుమతులపై విచారణ 24కు వాయిదా**



**హైదరాబాద్,జనవరి10:** గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా... బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయ టకు వచ్చారు. అయితే తొక్కిస లాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్ షోల కు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా... శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధారత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# ఇండియా బ్లాక్ శాశ్వతం

**ఎన్నికల్లో పోటీ కోసం కాదు : ఫరూక్ అబ్దుల్లా**



**శ్రీనగర్, జనవరి 10:** ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ శాశ్వతమని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు. కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది' అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని తెలిపారు. జమ్ముకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.


## తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా

# వైకుంఠద్వార దర్శనం

**వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తజనం**

**యాదాద్రి, భద్రాద్రి, ధర్మపురిల్లో ఉత్తర ద్వారదర్శనం**

**హైదరాబాద్,జనవరి10:** వైకుంఠ ఏకాదశి వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి నుంచి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఈ రోజు విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ పుణ్య రోజున భక్తులు లక్షలాదిగా



వైష్ణవాలయాలకు తరలివస్తారు. తిరుమలలో స్వామివారికి ఏకాంతంగా కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు.భద్రాచలంలో సరిగ్గా ఉదయం 5 గంటలకు భక్తులకు సీతారామచంద్ర స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి సేవలో తరించేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. యాదగిరిగుట్టలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. ఇవాళ స్వామివారికి గరుడ సేవోత్సవం, తిరువీధిసేవ నిర్వహించనున్నారు. ధర్మపురి నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. జంటనగరాల్లో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలా డాయి. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వెంకటేశ్వరాలయాలు, బంజారాహిల్స్ వేంకటేశ్వరాలయం, చిక్కడపల్లి, పెద్దమ్మగుడి, నానాక్‌రామ్ గూడ, ఓల్డ్ సిటీ రంగనాథ స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేసారు. వేకవ జామునుంచే ఆలయాలను దర్శించుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. చిలుకూరు ఆలయానికి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# విద్యార్థులు స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**- విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**- ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్**




**తొలి సమయం నర్సంపేట జనవరి 10**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా ఆద్వర్యంలో నర్సంపేటలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో జనవరి 12 స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ అవేర్నెస్ సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఏఓ. సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేల్పుల రాజుకుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రపంచ దేశాలకు భారతీయ సంస్కృతినీ చాటి చెప్పారని, హిందుత్వాన్ని జాగృత పరిచారని, ఆయన జీవితాన్ని ప్రతి విద్యార్థి కూడా ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు అలాగే నేటి కాలంలో మాదకద్రవ్యాలు విద్యార్థుల ప్రాణాల మీదికి తెస్తున్నాయని, రోజురోజుకు డ్రగ్స్ స్మగ్లింగ్ పెరిగిపోతుందని, ప్రభుత్వాలు ఎంత కట్టడి చేసినా ఆగడం లేదని, మాదకద్రవ్యాలకు బానిసలై ఎంతో మంది యువకులు తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారని, డ్రగ్స్ వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని, విద్యార్థులు యువకులు, మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు, విద్యార్థులు స్వాతంత్ర సమరయోధులను, స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని తమ జీవితంలో ఎదగాలని విద్యార్థులను కోరారు, ప్రతి విద్యార్థి కూడా జాతీయ భావాలతో దేశాన్ని కాపాడుకోవాలని, విదేశీ విష సంస్కృతిని విడనాడి స్వదేశీ సంస్కృతిని పాటించాలని కోరారు, అలాగే కళాశాల ఏఓ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువులపై దృష్టి పెట్టాలని, విష సంస్కృతులను దూరంగా పెట్టి జీవితాన్ని ముందుకు సాగించాలని, అలాగే ట్రాఫిక్ రూల్స్ మరియు ప్రభుత్వ అధికారుల సూచనలు క్రమం తప్పకుండా పాటించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, నర్సంపేట నగర కార్యదర్శి రాకం రాకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిప్పారపు గణేష్, నెక్కొండ జాయింట్ సెక్రెటరీ దాసరి గణేష్, కార్యకర్తలు సాయి, ప్రణయ్, అభి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పిఓడబ్ల్యూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పగిడిపాల తిరుపతమ్మ, ఊకె పద్మ ఎన్నిక**

**మహిళలకు నెలకు 2500 ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలి**






**తొలి సమయం, మహబూబాబాద్ జనవరి 10:**
పిఓడబ్ల్యు జిల్లా విలీన సమావేశంలో అధ్యక్ష నూతన అధ్యక్ష కార్యదర్శులు పగిడిపాల తిరుపతమ్మ, ఊకే పద్మల ఎన్నిక అయ్యారు. జిల్లాలోని రెండు ప్రగతి శీల మహిళా సంఘాల విలీన సమావేశం మహబూబాబాద్ బట్టు అంజయ్య భవన్లో జరిగింది. ఈ సమావేశంలో రెండు సంఘాలను విలీనం చేస్తూ తీర్మానం చేసుకోవడం జరిగింది. సంఘం నూతన జిల్లా అధ్యక్షురాలుగా పగిడిపాల తిరుపతమ్మ, నూతన ప్రధాన కార్యదర్శిగా ఊకె పద్మలను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ,పద్మలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు నెలకు 2500 ఇస్తామని చేసిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇంతవరకు అమలు చేయలేదని, వెంటనే దానిని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వారు ఆరోపించారు. మహిళల నెలవారి 25 వందల రూపాయలతో పాటు మిగతా హామీలన్నిటిని అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 20న జరుగు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.ప్రగతిశీల మహిళా సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభ 24-1-2025న మంచిర్యాల పట్టణంలో జరగబోతున్నదని ఆ విలీన సభను విజయవంతం చేయాలని తిరుపతమ్మ పద్మలు కోరారు. ఈకార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు బట్టుబిన్నమ్మ, గుజ్జ కృష్ణవేణి, బొల్లం సోమక్క, ఉపేంద్ర సహాయ కార్యదర్శులు ఎండి కవిత, వజ్జ సమ్మక్క, పొన్నం రమ పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆగబోయిన నర్సక్క, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నం లక్ష్మి తుడుం అనురాధ జిల్లా కార్యవర్గ సభ్యులు సుజాత, శివ్వారపు శారద,రమణ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ వయస్సు పెంచాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

**టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు చిక్కాల సతీష్**



**తొలి సమయం తొర్రూరు జనవరి 10**
పదవీ విరమణ చెందిన ఉద్యోగుల కు రావాల్సిన బిల్లులు చెల్లించలేక ఈ నిర్ణయం. నిరుద్యోగ యువతను గందరగోళపరచడానికే నిర్ణయం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచాలనే నిర్ణయం ఎంతోమంది నిరుద్యోగులకు నష్టదాయకం...వారు సంవత్సరాల తరబడి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం అనైతిక చర్య. ఇట్టి నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోని నిరుద్యోగులకు న్యాయం చేయాలి.ప్రస్తుత జీవన ప్రమాణ రేటు పరిశీలన చేస్తే ప్రస్తుతమున్న ఈ 61 సంవత్సరాల వయసు సరిపోతుంది . కేవలం పదవీ విరమణ ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్కాష్మెంట్ ,జెడ్పి జిపిఎఫ్ ఫైనల్ పేమెంట్స్ చెల్లించలేకనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది . మార్చి 2024 నుండి రిటైర్ అయినటువంటి ఏ ఉద్యోగికి, ఉపాధ్యాయునికి ఇట్టి చెల్లింపులు చెల్లించకపోవడం దురదృష్టకరం అది వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తుంది.వారికి అనేక ఆరోగ్య సమస్యలను తెస్తుంది.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అశాస్త్రీయమైన పదవీ విరమణ పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకొవాలి నిరుద్యోగులను ఆదుకోవాలి

# బిఆర్ఎస్ కార్యకర్త భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి రెడ్యానాయక్



**తొలి సమయం దంతాలపల్లి జనవరి 10**
దంతాలపల్లి మండల కేంద్రంలో తాడగుట్ట రెడ్డి మరణించిన వారి పార్థివదేహానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఆయన చేసిన సేవలు కొనియాడారు గత కొన్ని సంవత్సరాలుగా పార్టీకి అండగా ఉంటూ ఒక మిత్రునిగా మిత్రుని లాగా ఎప్పుడు వెన్నంటూ ఉండేవాడు అన్నారు తన సేవలు మరువలేనివి అని గుర్తు చేసారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఓలాద్రి మల్లారెడ్డి వీరబోయిన కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## బేతోల్ స్కూల్ లో ఘనంగా ముగ్గుల పోటీ



**తొలి సమయం, మహబూబాబాద్ జనవరి10:**
బేతోల్ స్కూల్ లో విద్యార్థులకు ఘనంగా ముగ్గుల పోటీ నిర్వహించారు, విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఐలయ్య,ఏ వాణి,కె నాగరాజు డి.శ్రావణి, బి రోషకృష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ జన్మదిన వేడుకలు



**తొలి సమయం దంతాలపల్లి జనవరి 9**
దంతాలపల్లి మండలం దాట్ల గ్రామం లో మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గురుపాల్ రెడ్డి. మండల నాయకులు నెమ్మది యాకన్న SK జానీ పాష పొన్నెటి బాలాజీ.బొల్లు వీరన్న. బొడ్డుపల్లి వెంకన్న. దాట్ల గ్రామ పార్టీ అధ్యక్షులు గుండాల అయిలయ్య.లక్ష్మీపురం గ్రామ పార్టీ అధ్యక్షులు.కోడి స్వామి దాసరిఅజయ్. సాయి.సందీప్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆల్ఇన్వన్ పంపిణీ

**ముఖ్యఅతిథి జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి**




**తొలి సమయం తొర్రూరు జనవరి 10**
జడ్.పి.హెచ్.ఎస్ దంతాలపల్లి లో పదవతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సేవా పరమా వదిగా ప్రభుత్వ పాఠశాల పిల్లలందరూ కష్టపడి చదివి 100% రిజల్ట్ సాధించేలా కృషి చేయాలన్నారు స్కూళ్లలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరినారు తల్లిదండ్రుల గురువులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ ఎస్ దంతాలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ రెడ్డి సురేంద్ర గుప్తా బండ శ్రీనివాస్ రెడ్డి టీచర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వెళితే సురేష్ కోశాధికారి ఎద్దు వెంకన్న పూర్వ అధ్యక్షులు రాయపల్లి యాకయ్య క్లబ్బు ప్రతినిధులు చింతరామయ్య చైర్మన్ తోట రమేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమలను దర్శనం చేసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్



**తొలి సమయం దంతాలపల్లి జనవరి 10**
తిరుమల శ్రీవారి పుణ్యక్షేత్రం ఉత్తర ద్వారం గుండా శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులనుకు దర్శనం ఇచ్చారు తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ వెంకటేష్ స్వామి దర్శనం చేసుకున్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన అందరికీ అందే విధంగా కృషి చేయాలి

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పార్టీ నాయకులందరూ క్షేత్రస్థాయిలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పని చేయాలి..**

**పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**





**తొలి సమయం,తొర్రూరు**

తొర్రూరు మండల మరియు పట్టణ ముఖ్యనాయకుల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు నేడు పాలకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే గాక్యాంప్ కార్యాలయంలో తొర్రూరు మండల మరియు పట్టణ ముఖ్యనాయకులతో మరియు మండలంలోని, వివిధ గ్రామాపార్టీ అధ్యక్షులతో కలిసి మండల స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశశ్విని ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డీ మాట్లాడుతూప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే విధంగా కృషి చేయాలని అన్నారు,పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనే విధంగా కార్యకర్తల ప్రోత్సహించాలని,పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు,కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అందరూ సమన్వయంతో పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలనీ తెలిపారు,ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లి అందరికీ అవగాహన కల్పించాలని కోరారు, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకొని పనిచేయాలని కార్యకర్తలకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వెంటోయిస్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో
# దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు పంపిణీ







**హన్మకొండ,జనవరి 10**

హన్మకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో స్పాన్సర్లు వెంటోయిస్ సీఈవో, హన్మకొండ ఎన్నారై సుమన్ రెడ్డి కోట, టీటీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దివాకర్ జంధ్యం ఎన్నారై వరంగల్ వాసి సహకారంతో 110 మందికి కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కే.ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగుల అవసరాలను అంచనా వేయడానికి గతంలో నవంబర్లో స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించాం. ఎన్ ఆర్ ఐ స్పాన్సర్ల ఉదార సహకారంతో, రంగారావు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సహకారంతో ఈ కార్యక్రమం సాధ్యమైంది అన్నారు. కృత్రిమ అవయవాల పంపిణీతో పాటు, డెంటల్ స్క్రీనింగ్ కూడా నిర్వహించామని అన్నారు.ఆర్థోపెడిక్ వైద్యుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి పంపిణీ శిబిరంలో పాల్గొని వికలాంగులకు వైద్య సలహాలు, సహకారాలు అందించారు. ఈ వ్యక్తులు నడవడం వారి స్వతంత్రతను తిరిగి పొందడం చూడటం ఒక లోతైన కదిలించే అనుభవం అన్నారు. కొత్త అవయవాలతో నావిగేట్ చేస్తున్నప్పుడు వారి కళ్ళలో ఆనందం నిజంగా మరువలేనిది. కృత్రిమ అవయ వాలను దానం చేయడంలో, వరంగల్ కమ్యూనిటీకి క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిం చడంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ కీలక పాత్ర పోషించింది అన్నారు. దివాకర్ జంధ్యం సోదరులు డాక్టర్ మధుకర్ జంధ్యం, జంధ్యం కరుణాకర్, పలువురు వాలంటీర్లు ఈ కార్యక్రమం విజయవంతం విశేష కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధాకిషన్ రెడ్డి, సాయి సందీప్, ఎం. దివాకర్ రెడ్డి, శ్రావణ్ శెట్టి, హరికృష్ణ, జాన్ ప్రశాంత్, చైతన్య, కిరణ్, పి. ప్రశాంత్, బాలాజీ, అర్జున్, దిలీప్, ప్రణయ్, వినయ్, సాయిరాం, నైనిష్, శాస్త్రి, దేవరాజ్, అఖిలేష్ పాల్గొన్నారు.

# అజ్ఞాతం వీడి.. జనజీవన స్రవంతిలో కలవండి!

## సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



**హన్మకొండ,జనవరి 10**

హసన్ పర్తి మండలంలోని వంగపాడు గ్రామానికి చెందిన మావో యిస్టు నేత మందా రూబెన్ అలియాస్ మంగన్న గత 40 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉండగా ఆయన కుటుంబాన్ని శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పరామర్శించారు.ఈ సందర్భంగా రూబెన్ తల్లి చంద్రమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రస్తుతస్థితి గతులతో పాటు చంద్రమ్మ ఆరోగ్య పరిస్థితిపై డీసీపీ అడిగి తెలుసు కున్నారు. అనంతరం సోమయ్య తల్లి చంద్రమ్మకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పంపించిన చీరతో పాటు కుటుంబ సభ్యులకు దుప్పట్లు,నిత్యావ సరసరకులను పోలీసు అధికా రులు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అజ్ఞాతంలో వుంది మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని. ఇకనైనా రూబెన్ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని, ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని. ఇవే కాకుండా అజ్ఞాత జీవితం గడుపు తున్న మావోయి స్టులు ఆరోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొం టున్నారని. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదురుకా ల్పుల్లో హత మయ్యారని. అదేవిధంగా. మందా రూబెన్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే, ఆయనపై ఉన్న రివార్డ్ పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజ నాలు అందేలా కృషిచేస్తామని డీసీపీహామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ తిరుమల్, స్పెషల్ బ్రాంచ్2 ఏసీపీ పార్థసారథి,హసన్ పర్తి ఇన్స్పెక్టర్చేరాలు తదితరపోలీస్అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్హెచ్ఆర్సి నల్గొండ జిల్లా కమిటీ

**జిల్లా అధ్యక్షురాలుగా పేరపాక నిర్మలాదేవి మిర్యాలగూడ**

**జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఊరుకొండ శ్రీనివాసులు దేవరకొండ**




**నల్గొండ టౌన్,జనవరి 10**

జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా మిర్యాలగూడకు చెందిన సామాజిక ఉద్యమకారురాలు , తరంగాలు పత్రిక ఎడిటర్ పేరపాక నిర్మలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరకొండకు చెందిన ఊరుగొండ శ్రీనివాసులు లను నియమస్తూ ఉత్తర్వులను అందజేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, పాముల నారాయణలు తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బలమైన లీగల్ ప్రొసీజర్ తో ముందుకు పోతున్న జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయాలని వారు ఆదేశించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన ఎన్ హెచ్ ఆర్ సి నల్గొండ జిల్లా అధ్యక్షురాలు పేరపాక నిర్మలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరుగొండ శ్రీనివాసులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన ఈ బాధ్యతలను నీతి, నిజాయితీతో నిర్వహిస్తామని, పేద ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంస్థ బలోపేతం కోసం పనిచేస్తామని అన్నారు. నల్గొండ జిల్లాలోని అన్ని మండల కమిటీల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకనపల్లి రాము, మీదింటి శివ వీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తోట రాజయ్య, పాముల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి గూడూరు మాంచాలక్క, బొమ్మిడాల మురళిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీరి ఇరువురి నియామకంతో నల్గొండ జిల్లా వ్యాప్తంగా సామాజిక ఉద్యమకారులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో రాణించిన కానిస్టేబుల్

**హన్మకొండ, జనవరి 10**



గత నెల హైదరాబాద్ లోని ఈ.సి.ఐ.ఎల్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ సాయిరాం ఐదు కిలోమీటర్ల పరుగులో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పతకాన్ని సాధించిన కానిస్టేబుల్ ను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. భవిష్యత్తు మరిన్ని పతకాలను సాధించి ఇతరులకు స్ఫూర్తి కావాలని సిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఐ అడ్మిన్ స్పర్జన్ రాజ్ పాల్గొన్నారు.

## టోల్గేట్ డివైడర్ తొలగింపు

**ఎల్కతుర్తి,జనవరి 10**



మండల కేంద్రంలోని గత 20 సంవత్సరాల క్రితం నేషనల్ హైవే అథారిటీసీ వారు ఏర్పాటుచేసిన టోల్గేట్ డివైడర్ తరచు ప్రమాదాలకు కేరఫ్ గా మారడంతో రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాలతో తొలగించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రమాదాలకు నిలయంగా ఉన్నటువంటి టోల్గేట్ డివైడర్ ను తొలగించడం ప్రజల యొక్క ప్రాణాలను కాపాడినట్టే అని అన్నారు. మంత్రి చొరువతో వేగవంతంగా జరుగుతున్నటువంటి సుందరీ కరణ పనులతో రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముస్తాబు కాబోతుందని మరికొద్ది రోజుల్లో ఎల్కతుర్తి ముఖచిత్రం రూపురేఖలే మారిపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సుఖినే సంతాజీ, సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బక్కి), తంగేళ్లపల్లి కొమురయ్య, శ్రీనివాస్, సారయ్య బత్తిని రవీందర్, రత్నాకర్ రావు పాల్గొన్నారు

## బన్ను న్యూరో హెల్త్ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు



**హన్మకొండ, జనవరి 10**

బన్ను న్యూరో హెల్త్ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా సహకారశాఖ అధికారి ఎం. నీరజ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈ.వి శ్రీనివాస్ రావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీఓ నీరజ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారికి నూతన అవకాశాలు మరియు ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రత్యేక పాఠశాలలు విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లల సంతోషానికి కారణమైన ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు చాలా బాగా నిర్వహించారని అభినందించారు. బన్ను స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి. కిరణ్ కుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బందిని కూడా ప్రశంసించారు.సంక్రాంతి వేడుకలలో భాగంగా, భోగిమంటలు వెలిగించి, పండుగ ప్రత్యేకతను పిల్లలకు తెలియజేశారు. పిల్లలతో కలిసి భోగిపల్లు పోసి, పల్లె వాతావరణంలో పండుగను జరుపుకున్నారు. అదనంగా, రంగవల్లులు వేసి పతంగులను ఎగురవేసి ఉత్సాహంగా పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ నేహాల్,స్కూల్ స్టాఫ్, విద్యార్థులు, ఇతర అతిథులు పాల్గొన్నారు.బన్ను ఆరోగ్య సేవా సంఘం న్యూరోలాజికల్ సమస్యల సేవలకోసం నిరంతరం కృషి చేస్తునమాని తెలిపారు.

# ఎన్కౌంటర్‌లో మృతిచెందిన
# నక్సల్స్ వివరాలు విడుదల...

**చర్ల, జనవరి 10**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్ జిల్లాలో గురువారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. పోలీసులు మృతి చెందిన మావోయిస్టుల వివరాలు శుక్రవారం విడుదల చేశారు. అందిన సమాచారం ప్రకారం, పాలిగూడ-గుండారాజ్‌గూడెం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ముగ్గురు మావోయిస్టులపై మొత్తం రూ.18 లక్షల రివార్డు ప్రకటించారు. గురువారం సుక్మా, బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మహేష్ కోర్సా కూడా మరణించినట్లు పోలీసులు తెలిపారు. అతను సౌత్ బస్తర్ డివిజన్ మరియు పీఎల్‌జిఏ బెటాలియన్ నంబర్‌వన్ యొక్క ఐఈడి నిపుణుడు. ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు మహేశ్ కోర్సా 2023లో బెద్రే, 2024లో జాగర్‌గుండ ప్రాంతంలో జరిగిన ఘటనలకు సూత్రధారి కూడా. ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టులను పీపీసీఎం ప్లాటూన్ నంబర్ 30 డిప్యూటీ కమాండర్ కోర్సా మహేష్, మాండ్వి నవీన్ అలియాస్ కోసా ఏసీఎం వెస్ట్ బస్తర్, అల్వం భీమా ఏసీఎం జోనగూడగా గుర్తించినట్లు పోలీసులు ప్రెస్ నోట్ విడుదల చేసారు .ఈ ఎన్కౌంటర్ లో నక్సల్స్ నుండి రెండు బీజీఎల్ లాంచర్లు, తో పటు 1 12 బోర్ రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు మరియు ఎన్‌కౌంటర్ స్థలం నుండి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, నక్సల్ సాహిత్యం ఇతర రోజువారీఉపయోగకరమైన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.



# నలుగురు మావోయిస్టులు అరెస్ట్



**చర్ల, జనవరి 10**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లా చింత గుఫా పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు నక్సలైట్లను అరెస్టు చేసారు. అరెస్టు చేయబడిన నక్సలైట్లందరూ 2023 సంవత్సరంలో ఇద్దరు గ్రామస్తులను చంపిన సంఘటనలో పాల్గొన్నారు.చింతగుఫా పోలీస్ స్టేషన్, డిఆర్‌జి సుక్మా నక్సలైట్లను అరెస్టు చేయడంలో సంయుక్తంగా చర్య తీసుకు న్నారు.సుక్మా జిల్లాలోసీనియర్ అధికారుల మార్గదర్శ కత్వంలో నక్సల్ నిర్మూలన ఆపరేషన్ జరుగుతోంది, ఈ విషయంలో, బుధవారం నక్సల్ ఉనికిపై నిఘా ఉంచిన నేపథ్యంలో చింతగుఫా పోలీస్ స్టేషన్ నుండి డి ఆర్ జి మరియు జిల్లా బలగాల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కోసం తాడ్మెట్ల అటవీ ప్రాంతం ఆపరేషన్ కోసం బయలుదేరినప్పుడు, ఖేత్ లాడి సమీపంలోని తాడ్మెట్ల గ్రామ అటవీ ప్రాంతంలో, కొంతమంది అనుమానాస్పద వ్యక్తులు పోలీసుల బృందాన్ని చూసి పారిపోవడం ప్రారంభించారు, వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. పోలీసు పార్టీ ద్వారా. అరెస్టు చేసిన నిందితులను విచారించగా, వారు వరుసగా వారి పేర్లను వెల్లడించారు సోడి దేవా తండ్రి దివంగత పోజ్జా (సి యెన్ ఏం సభ్యుడు, దులేద్ ఆర్ పీ సి కింద) గ్రామం తడ్మెట్ల స్కూల్‌పారా పోలీస్ స్టేషన్ చింతగుఫా జిల్లా సుక్మా (సి జి ), .మాద్వి మాడా తండ్రి దివంగత. హుంగా (మిలిషియా సభ్యుడు) వయస్సు 25 సంవత్సరాలు గ్రామం తడ్మెట్ల మదేంపారా పోలీస్ స్టేషన్ చింతగుఫా జిల్లా సుక్మా( సి జి ), సోడి భీమా తండ్రి హిడ్మా (మిలిషియా సభ్యుడు, దులేద్ ఆర్ పీ సి గ్రామం తడ్మెట్ల స్కూల్ పారా పోలీస్ స్టేషన్ చింతగుఫా జిల్లా సుక్మా (సి జి ), మోతు అలియాస్ అశ్విన్ అలియాస్ పొడియం దేవా మిలిషియా సభ్యుడు, మెట్టగూడెం ఆర్ పీ సి బీజాపూర్ జిల్లా, పామెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్టగూడ గ్రామానికి చెందినవాడని చెబుతారు.అరెస్టు చేసిన నిందితులను కఠినంగా విచారించగా, వారు తమ ఇతర నక్సల్ సహచరులతో కలిసి, చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని తడ్మెట్ల గ్రామానికి చెందిన కవాసి జోగా కుమారుడు కవాసి సుక్కాను మరియు మద్వి ముక్కా కుమారుడు మద్వి గంగను హత్య చేసినట్లు అంగీకరించారు. పోలీసు ఇన్ఫార్మర్లు అనే అభియోగంపై మోర్పల్లి అడవికి వెళ్ళారు. ఈ సంఘటనకు సంబంధించి, చింతగుఫా పోలీస్ స్టేషన్‌లో 05/2023 కేసు నంబర్‌ను నమోదు చేశారు. వివిధ చట్టాలలో ఉన్న సెక్షన్స్ కింద కేసు నమోదుచేశారు ఛత్తీస్గఢ్ లో ఇప్పటికే ప్రత్యేక భద్రతా చట్టం 2005 కింద నమోదైంది. పైన పేర్కొన్న అరెస్టయిన నక్సలైట్ నిందితులు నేరం చేసిన తర్వాత గత ఒక సంవత్సరంగా పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న నక్సలైట్ నిందితులను గురువారంఅరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌పై జైలుకు పంపారు.

# నెక్నాంపూర్ చెరువులో ఆక్రమణల కూల్చివేత

## అక్రమ కట్టడాలను కూల్చేసిన హైడ్రా

**హైదరాబాద్,జనవరి10:** నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా.దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది. నెక్నాంపూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు వెలిశాయి. గతంలో టౌన్ ఎ÷-లానింగ్ అధికారులు, రెవన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణాలు వెలిశాయి. మూడు సార్లు కూల్చివేతలు జరిగినప్పటికీ స్థానిక అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమ నిర్మాణాలను చేస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ విల్లాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం హైడ్రా కమిషన్ రంగనాథ్ అక్కడకు చేరుకుని నెక్నాంపూర్ చెరువుకు సంబంధించిన లేఅవుట్‌లను పరిశీలించారు. ఎంత మేరకు అక్రమాలు జరిగాయనేదానిపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత.. స్థానిక అధికారులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది.నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లపై హైడ్రా ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ శివారు నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిపై యాక్షన్ తీసుకోవాలని ఇప్పటికే హైడ్రా అధికారులకు హైడ్రా చీఫ్ కీలక ఆదేశాలు చేశారు. అందులో భాగంగానే మణికొండ నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది.

## విజయవాడ రహదారిలో
# రోడ్డు మరమ్మత్తులు

**వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సిందే**

**హెచ్చరించిన పోలీసు, ఎన్‌హెచ్ఎ అధికారులు**

**నల్లగొండ,జనవరి10:** సంక్రాంతి పండగ సమయంలో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు ఒకదాని వెనుక ఒకటి వరుస కడతాయి. ప్రస్తుతం దారి పొడవునా మరమ్మతు పనులు నడుస్తున్నాయి. ఎల్బీనగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు ఆరు వరుసల విస్తరణ పనులు.. దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు బ్లాక్‌స్పాట్స్‌లో అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. డ్రైవింగ్‌లో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు సంభవించడంతోపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. చాలాచోట్ల పనులు జరుగుతున్నందున వాహనాలను అప్రమత్తంగా నడపాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. ఇనామ్‌గూడ వద్ద అండర్‌పాస్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పండక్కి వెళ్లే వాహనాలతో ఇక్కడ ట్రాఫిక్‌జామ్ అయ్యే అవకాశముందని, వంతెన మీద మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ బస్టాప్‌ల వద్ద విస్తరణ చేపట్టకపోవడంతో ఆయాచోట్ల ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తే అవకాశముంది. మరోవైపు దండుమల్కాపురం నుంచి నందిగామ మధ్య తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో మరమ్మతు పనులు నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు నిదానంగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

# బిజెపిలో చేరిన మాజీ సిఎం రఘువరదాస్

రాంచీ,జనవరి10: మేము తిరిగి వస్తామనే నినాదంతో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ తిరిగి బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు,కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించా రు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమ న్నారు. 2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. ఇప్పుడు ఆయన రెండోసారి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుం టున్నారు. తాను గవర్నర్‌గా నియమి తుడైనప్పు డు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాను లిసి తన రాజీనామాను సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు. రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారం లో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు. జార్ఖండ్ ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని తాను గౌరవిస్తున్నానని మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ అన్నారు. జార్ఖండ్ ప్రజలు ఇండియా అలయన్స్ ప్రభుత్వానికి పాలించడానికి మెజారిటీ ఇచ్చారు.

# బట్టిగూడెంలో కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం

**చర్ల పోలీస్ లు బట్టిగూడెంలో వన్ హెచ్ పీ మోటార్ ,నలబై రగ్గులు పంపిణి**


**పాల్గొన్న చర్ల సి ఐ రాజువర్మ ,ఎస్ ఐ నర్సి రెడ్డి**



**చర్ల, జనవరి 10**

చర్ల మండలంలోని బట్టి గూడెం గ్రామంలో శనివారం కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాంలో భాగంగా చర్ల మండల పోలీస్లు చర్ల సీఐ రాజు వర్మ ఆధ్వర్యంలో బట్టి గూడెం గ్రామంలోని ఆదివాసీలకు వన్ హెచ్ పి మోటార్,40 రగ్గులను ఉచితంగా పంపిణీ చేసారు.బట్టి గూడెం లోని ఆదివాసీల అవసరాల నిమిత్తం వన్ హెచ్ పి మోటార్నీ చలి తీవ్రతకు తట్టుకునే లాగా 40 రగ్గులను ఉచితంగా పంపిణీ ఈ కార్యక్రమంలో చర్ల సిఐ రాజవర్మ ఎస్సై నర్సిరెడ్డి ఇతర పోలీసు సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయం



**చర్ల, జనవరి 10**

చర్ల మండలంలో రెండవ శనివారంలో భాగంగా సత్యనారాయణ పురం సబ్ స్టేషన్ నుండి వచ్చే 11కేవి ఫీడర్లకు ఉదయం11 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ మరమ్మత్తులు చేయబడును కావున 11కే వి సత్యనారాయణ పురం,తేగడ, గోగుబాక,జట్టిగూడెం, ఆర్ డబ్లుయూ ఎస్ ఫీడర్లకు ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారి తెలిపారు.

# వనవాసి పరిషత్‌కి నిత్యావసరాల వితరణ



**చర్ల, జనవరి 10**

చర్ల మండలంలోగల వనవాసి పరిషత్ కి గుంటూరు తులసీ సీడ్స్ జనరల్ మేనేజర్ జవ్వాది కోదండ రాంబాబు శుక్రవారం ఆయన తల్లిదండ్రులు జవ్వాది నారాయణమూర్తి - జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ విద్యార్థులకు పాదరక్షలు, 50 కేజీల బియ్యం తో పాటు భోజనం ఏర్పాట్లు, మిఠాయిలు, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా కోదండ రాంబాబు విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు ప్రతి ఒక్కరూ చదువుతోనే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని అన్నారు. విద్యతోనే విజ్ఞానం అందుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదివి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తమను ఎంతో ఆకట్టుకున్నదని అన్నారు. కార్యక్రమంలో వనవాసీ కల్యాణ పరిషత్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి తాడేపల్లి శివరామకృష్ణ, వనవాసీ మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జవ్వాది కుటుంబ సభ్యులు జవ్వాది రవిచంద్రకుమార్, జవ్వాది మురళీకృష్ణ, జవ్వాది శ్రీనివాసరావు, జవ్వాది కుబేర శ్రీకాంత్, జవ్వాది ప్రశాంత్, కోరి గణేష్, జవ్వాది పూర్ణిమ, జవ్వాది త్రైతీక్య, పగడాల గీతాంజలి, జవ్వాది స్నేహ శ్రీ, నిలయ కమిటీ సభ్యులు తాటి పాపారావు, గొంది శోభన్‌బాబు, గోగికార్ రాంలక్ష్మణ్, పోలిన రమాదేవి, పాశికంటి శ్రీదేవి, గొంది ప్రసన్నకుమారి, పాల్గొన్నారు.

# తిరుమల ఘటనలో ఎవ్వరినీ ఉపేక్షించం

**నేడు మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ**

**తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం**

**తిరుమల,జనవరి10:** వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి బాధ్యులను ఉపేక్షించే ప్రసక్తే లేదని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ సమావేశం వివరాలను వెల్లడించారు. 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని మా దృష్టికి వచ్చింది. ఘటనపై ఇప్పటికే సీఎం న్యాయవిచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా చూస్తాం అని అన్నారు. అయితే ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. మృతుల కుటుంబాలకు చెక్కులు సిద్ధం చేశాం. శనివారం ఉదయం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. క్షమాపణ చెప్పడంలో తప్పులేదు. క్షమాపణ చెప్పినంత మాత్రాన చనిపోయిన వాళ్లు తిరిగిరారు. ఎవరో ఏదో మాట్లాడారని వాటన్నింటికీ స్పందించాల్సిన అవసరం లేదు. తప్పిదం జరిగింది.. ఎలా జరిగింది అనేది విచారణలో తేలుతుంది. విచారణ త్వరగా పూర్తి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్తాం. ఆ తర్వాతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని నాయుడు తెలిపారు.

## యూట్యూబర్ ఫన్‌బకెట్
# భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

**విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు**

**విశాఖపట్నం,జనవరి10:** విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా ప్రాచుర్యం పొందిన యువకుడు 'ఫన్ బకెట్' భార్గవ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలతో భార్గవ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కేసు వివరాల ప్రకారం.. నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అమానుష చర్య కారణంగా బాలిక గర్భం దాల్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విశాఖ నగర మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. ఛార్జ్‌షీట్‌తో పాటు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించిన విశాఖపట్నం ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షను విధించడంతో పాటు, బాధిత బాలికకు నష్టపరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది.

## విశాఖ వందేభారత్‌కు
# అదనంగా నాలుగు కోచ్‌లు

**సంక్రాంతి రద్దీ దృష్ట్యా రైల్వేశాఖ నిర్ణయం**

**హైదరాబాద్,జనవరి10:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగిస్తోన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా కోచ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 16 కోచ్‌లతో నడుస్తోన్న విశాఖ-సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అదనంగా మరో 4 కోచ్‌లను జత చేసింది. అదనపు కోచ్‌లు జనవరి 11 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. మరో 4 కోచ్‌లు పెంచడం ద్వారా ప్రస్తుతం 1,128గా ఉన్న సీటింగ్ కెపాసిటీ 1,414కి చేరనుంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101